క్లుప్తంగా

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ



కేటీదొడ్డి: మండలంలోని గువ్వలదిన్నె గ్రామ శివారులో మిషన్ భగీరథ పైపులైన్ రెండు రోజులుగా లీకేజీతో రోడ్డుపై వృథాగా పోతోంది. పంచాయతీ అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని,వేసవికాలంలో తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా అధికారులు తెలిపినా పట్టించుకోవడం లేదు. తాగునీరు వృథాగా పోతున్నా మరమ్మతు చేయించాలని గ్రామస్తులు విన్నవించినా పట్టించుకోవడం లేదు. జిల్లా అధికారులు స్పందించి మరమ్మతు చేయాలని ప్రజలకు కోరుతున్నారు.

విద్యార్థినికి సన్మానం



అయిజ: మున్సిపాలిటీ పరిధిలోని పర్దీపురం గ్రామనికి చెందిన శ్రీరాములు, శారద దంపతుల కూతురు తేజస్విని 2023–24 విద్యాసంవత్సరంలో పదో తరగతి పరీక్షల్లో జీపీఏ 10/10 సాధించిన సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మంగళవారం విద్యార్థిని ఆమె నివాసంలో అంబేద్కర్ చిత్రపటం ఇచ్చి సత్కరించారు. ఈసందర్భంగా బేడ బుడుగ జంగం జిల్లా అధ్యక్షులు అశ్వ మారెప్ప మాట్లాడుతూ.. సీఓఈ సీటు సాధించిన విద్యార్థిని తేజస్విని అభినందించారు. భవిష్యత్‌లో ఉన్నత చదువులు చదివి గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంజనేయులు, బీఆర్ఎస్ నాయకుడు అంజి బాబు తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయంలో చోరీ

రాజోళి: మండల కేంద్రంలోని తుంగభద్ర నది ఒడ్డున ఉన్న గంగమ్మ ఆలయంలో చోరీ జరిగిన ఘటన చోటుచేసుకుంది. ఎస్ఐ జగదీశ్వర్ వివరాల ప్రకారం.. గంగమ్మ గుడిలో సామవారం ఉదయం అర్చకుడు వినోద్ అమ్మవారికి అభిషేకం, పూజలు చేసి అనంతరం ఇంటికి వెళ్లాడు. తిరిగి సాయంత్రం ఆలయంలో మైక్‌లో పాటలు పెట్టేందుకు గుడికి వచ్చాడు. ఆలయం తలుపులు, గేటు తాళం పగలగొట్టి ఉండటంతో వెంటనే ఆలయ కమిటీకి, నిర్వాహకులకు సమాచారం ఇచ్చాడు. గుడిలో అమ్మవారి కళ్లు, ముక్కుపుడక ఇతర వెండి ఆభరణాలు చోరీకి గురైనట్లు పేర్కొన్నారు. హుండీలో రూ.5 వేల నగదు అపహరించినట్లు కమిటీ చైర్మన్ రంగన్న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో పాటు తుమ్మలపల్లె లోని ఆలయంలో కూడా చోరీ జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, విచారణ చేసి చర్యలు తీసుకుంటామని ఎస్ఐ తెలిపారు.

సీసీ రోడ్లు నిర్మించండి

అయిజ: మండలంలోని తూంకుంటలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవడంతో పారిశుద్ధ్యం లోపించింది. గ్రామంలోని ప్రధాన రోడ్డు చిత్తడిచిత్తడిగా మారింది. డ్రెయినేజీలు



నిర్మించకపోవడంతో నివాసగృహాల్లో నుంచి బయటకు వచ్చే మురుగు రోడ్డుపై నిలుస్తోంది. రోడ్డు గుంతల్లో చేరి దుర్వాసన వెదజల్లుతోంది. వర్షాకాలంలో దోమల ఉధృతి ఎక్కువై ప్రజలు అనారోగ్యానికి గురయ్యే అవకాశాలున్నాయి. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి సీసీ రోడ్లు, డ్రెయినేజీలను నిర్మించాలని కోరుతున్నారు.

మందుల పంపిణీ

మానవపాడు: ముప్పై ఏళ్లు పైబడిన వారికి దీర్ఘకాలిక వ్యాధుల పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయితే వారికి మందులు పంపిణీ చేయాలని ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్ చందన తెలిపారు. మంగళవారం కేంద్రంలోని ఆరోగ్యకేంద్ర పరిధిలోని గ్రామాల్లో వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు పరీక్షలు నిర్వహించి ప్రతి ఒక్కరికీ మందులు పంపిణీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాధితులను పరామర్శించిన నాయకులు

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల కేంద్రానికి చెందిన వడ్ల గోవిందమ్మ, దాసరి భాస్కర్‌లు అనారోగ్యంతో అకాల మరణం చెందారు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జోగుల రవి, పోతురాజు శంకరమ్మ ట్రస్ట్ చైర్మన్ సోమనాద్రి మంగళవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి మట్టి ఖర్చులకు రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. వారితో పాటు పెద్ద లక్ష్మన్న, వెంకటన్న, రవి, బీచుపల్లి, జాకీర్, కృష్ణయ్య, రాజు ఉన్నారు.

రహదారులపై కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం



ఉండవెల్లి నుంచి కంచుపాడు వెళ్లే దారిలో గుంతల మయంలో రహదారి

- అసంపూర్తి పనులతో ప్రజల అవస్థలు
- ప్రమాదాలకు గురవుతున్న వాహనదారులు
- పట్టించుకోని అధికారులు

ఉండవెల్లి: మండలంలోని అన్ని గ్రామాల్లో అసంపూర్తి రోడ్ల వల్ల ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం, ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. అలంపూర్ నుంచి బైరాపురం మీదుగా కర్నూల్‌కు వాహనాలు అధికంగా వెళ్తుంటాయి. బ్రిడ్జ్ నిర్మాణం పనులు అసంపూర్తిగా ఉన్నాయి. భారీ వర్షాల పడితే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

గ్రామాలకు ముప్పుతిప్పలే..

జాతీయ రహదారి నుంచి పుల్లూరు వయా కలుగోట్ల మీదుగా మెన్నిపాడు గ్రామానికి గతంలో ఎంపీ నిధులతో రోడ్డు పనులను హైదరాబాద్ కాంట్రాక్టర్ చేపట్టి రోడ్డుపై కంకర వేసి వదిలేశారు. కంకరతో రెండు గ్రామాల ప్రయాణికులు ముప్పుతిప్పలు పడుతున్నారు. రూ.3 కోట్లతో పనులు చేయాల్సి ఉండగా, బ్రిడ్జి నిర్మించినా పనులు మాత్రం పక్కదారే అంటున్నారు స్థానికులు. బూడిదపాడు నుంచి ఉండవెల్లి, కంచుపాడు, తక్కశిల, ప్రాగటూరు, మారమునగాల గ్రామాలకు వెళ్లేందుకు బీటీ దెబ్బతిన్నది. గత ప్రభుత్వం టెండర్లు



కలుగోట్ల రహదారి కంకరతో నిండి ఉన్న రోడ్డు



హైవే నుంచి ఉండవెల్లికి వెళ్లే రహదారి

ప్రకటించిన ముందుకు రాలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొంత నిధులతో బీటీ దెబ్బతిన్న చోట తాత్కాలికంగా బీటీ వేసి చేతులు దులుపుకున్నారు. కొన్ని చోట్ల వాహనదారులే మట్టిని వేసి గుంతలు పూడ్చారు. 10 ఏళ్లైన బీటీ వేయడం లేదని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బైరాపురం గ్రామంలో 30 ఏళ్లుగా రోడ్డు నిర్మాణ పనులు పట్టించుకోవడం లేదని ప్రజాప్రతినిధులను, అధికారులను ప్రజలు ప్రశ్నించడంతో బ్రిడ్జి నిర్మాణం కొనసాగింది. మూడు నెలలుగా బ్రిడ్జి పనులు ఆగిపోయాయి, రోడ్డు లేక అడ్డదారిలో వాహనాలు పోలేక ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి నుంచి ఉండవెల్లి గ్రామానికి వెళ్లే బీటీ రోడ్డు ఎత్తులు, తగ్గులుగా ఉండడంతో ప్రయాణికులు ప్రమాదాలకు గురవుతున్నారు. బ్రిడ్జి శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

రోడ్డుపై పోవాలంటే భయంగా ఉంది..



రోడ్డు వేసి ఐదేళ్లైనా ఎత్తులు తగ్గులు, గుంతల మయంతో ఉండడంతో బైక్‌లు అదుపు తప్పుతున్నాయి. కర్నూల్ వెళ్తుంటే ప్రమాదాలకు గురై ఆస్పత్రి పాలవుతున్నాం. బైక్ పై వెళ్లి అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యారు. ఎవరు పట్టించుకోలేదు. రోడ్డు బాగు చేయించాలి.

– యుగేంధర్, ఉండవెల్లి

బిల్లులు రావడం లేదని వెనుకడుగు..

పుల్లూరు నుంచి కలుగోట్ల వయా మెన్నిపాడు గ్రామాలకు రోడ్డు పనులు జరిగిన కొంత శాతం మాత్రమే బిల్లులు మంజూరవడంతో మరికొన్ని రాకపోవడంతో కాంట్రాక్టర్ రాలేకపోతున్నారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పనులు చేయించేలా చూస్తాం. హైవే నుంచి ఉండవెల్లికి వెళ్లే రహదారి దెబ్బతినడం వాస్తవమే...ప్రపోజల్ వస్తే పనులు చేయిస్తాం.

– భరత్ కుమార్, పంచాయతీ రాజ్ శాఖ ఏఈ, ఉండవెల్లి మండలం



ఉండవెల్లిలో వర్షం

మోస్తరు వర్షం

ఉండవెల్లి: మండల కేంద్రం, కంచుపాడు గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది. కంచుపాడులో జమ్ములమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు వర్షం వల్ల ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఎలాంటి స్థావరం లేకపోవడంతో వర్షంలోనే ప్రయాణించారు.



కంచుపాడులో వర్షంలోనే తడుచుకుంటు వెళ్తున్న భక్తులు

విద్యార్థులకు సన్మానం

ఎర్రవల్లిచౌరస్తా: ఎర్రవల్లి మండల కేంద్రంలోని ఏకశిల పాఠశాలకు చెందిన విద్యార్థులు సోమవారం విడుదలైన సీబీఎస్ఈ పదో తరగతి ఫలితాల్లో అత్యధిక ఉత్తీర్ణతను సాధించారు. ఈ సందర్భంగా అధిక మార్కులు సాధించిన విద్యార్థులు రాహుల్ కుమార్‌రెడ్డి, దీపికారెడ్డి, హన్సిత, సంతోష్, చందనలను మంగళవారం పాఠశాల డైరెక్టర్ విష్ణువర్ధన్‌రెడ్డి పూల బొకేలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి, ప్రిన్సిపాల్ రామంజనేయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.



విద్యార్థి, తండ్రిని సన్మానిస్తున్న పాఠశాల

భగీరథ మహర్షి జయంతి



గట్టులో భగీరథ మహర్షి జయంతి చేస్తున్న సగర సంఘం నాయకులు



రాజోళిలో భగీరథ జయంతి వేడుకలు

గట్టు: భగీరథ మహర్షి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకొన్నారు. గట్టు, చిన్నోనిపల్లె గ్రామాల్లో సగర సంఘం నాయకులు భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు. గట్టు గ్రామపంచాయతీ వద్ద సగర సంఘం నాయకులు భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో సగర సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, రిటైర్డ్ హెడ్మాస్టర్ గోవిందప్ప, సగర సంఘం నాయకులు వెంకటేష్, ఉప్పరి శ్రీనివాసులు, వీరేష్‌సాగర్, వైకుంఠం, మహదేవ్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాజోళి: మండల కేంద్రంలో భగీరథ జయంతిని ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఈ వేడుకల్లో భగీరత చిత్రపటానికి పూల మాలలు వేసి, పూజా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలను తెలిపారు. కార్యక్రమంలో స్థానిక యువకులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

చిగురించిన వేరుశనగ



బీ తిమ్మాపూర్ శివారులో పూతదశలో వేరుశనగ పంట

అయిజ: మండలంలోని వివిధ గ్రామ శివార్లలో నెల రోజుల క్రితం బోరు బావుల కింద రైతులు కత్తెర పంటగా వేరుశనగ సాగుచేశారు. ఎండలు తీవ్రంగా మారడంతో వాతావరణంలో తేమశాతం తగ్గింది. దీంతో వేరుశనగ పంట పెరుగుదల నిలిచిపోయింది. దానికి తోడు భూగర్భ జలాలు అంతరించిపోవడంతో వేరుశనగ పంట ఎండుముఖం పట్టింది. రైతులు అదృష్టం బాగుండి వారం రోజుల్లో రెండు సార్లు వర్షం కురిసింది. ఈనెల 8న కురిసిన వర్షానికి వేరుశనగ పంట ఊపిరి పోసుకుంది. ఈనెల 13న కురిసిన వర్షంతో పంటపొలంలో సరిపడినంత తేమశాతం ఉండడంతో వేరుశనగ పంట చిగురించింది. ఇప్పుడు పూతదశకు వేరుశనగ మారి కలకలలాడుతోంది. దీంతో రైతుల ఆశలు చిగురించి ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఉండవెల్లిలో క్రికెట్ టోర్నమెంట్

ఉండవెల్లి: మండల కేంద్రంలో ఈదమ్మ జాతర సందర్భంగా ఈనెల 16 నుంచి టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు మేనేజ్‌మెంట్ ఒక ప్రకటనలో తెలిపింది. మొదటి బహుమతి రూ.50 వేలు, రెండో బహుమతి రూ.30 వేలు, మూడో బహుమతి రూ.15వేలు అందజేస్తామని తెలిపారు. ఆసక్తి గల వారు ఈ నెల 15 సాయంత్రం లోపు వివరాలు 9701115192, 9505056104కు కాల్ చేసి తెలపాలని పేర్కొన్నారు.

నేటి నుంచి కరాటే ఉచిత శిక్షణ

గద్వాల అర్బన్: వేసవి కాలం సెలవుల నేపథ్యంలో ప్రిన్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బుధవారం నుంచి జూన్ 6వ తేదీ వరకు జిల్లా కేంద్రంలో గంజిపేట సత్యసాయి డిగ్రీ కళాశాలలో ఉచిత తైక్వాండో కరాటే శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు గిరిబాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజు ఉదయం 5:30గంటల నుంచి 7:30గంటల వరకు 6–16ఏళ్ల బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల వారు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

పల్లెప్రకృతి వనం అగ్నికి ఆహుతి

వీపనగండ్ల: మండలంలోని కల్వరాలలో పల్లె ప్రకృతి వనంలో పెంచిన మొక్కలు అగ్నికి ఆహుతయి కాలిపోయిన ఘటన మంగళవారం చోటు చేసుకుంది. పల్లెప్రకృతి వనానికి సమీపంలో ఉన్న కాల్వలో గుర్తు తెలియని వ్యక్తులు జమ్ముకు నిప్పు పెట్టడంతో నిప్పురవ్వలు ఎగిసిపడి పల్లె ప్రకృతివనంలోని మొక్కలకు అంటుకున్నాయని తెలిపారు. ఘటనకు బాధ్యులైన వారిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బురదమయంగా రాయచూర్ రహదారి

ధరూరు: గద్వాల – రాయచూరు ప్రధాన రహదారి బురదమయంగా మారింది. మండల కేంద్రంలోని ఎరుకలి వీధి వద్ద ఇటీవల కురిసిన వర్షానికి గుంతలు ఏర్పడి బురదమయంగా తయారైంది. కొన్నేళ్లుగా ఈ ప్రాంతం గుంతలు ఏర్పడి వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు కలిగిస్తోంది. బీటీ రోడ్డుపై మట్టి నింపడంతో నిత్యం దుమ్ముమయమై ఆ ప్రాంతంలోని రోడ్డుకు ఇరువైపుల ఉన్న ఇళ్ల వారు దుమ్ముతో చర్మ రోగాల బారిన పడుతున్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షానికి కుర్వ వీధి, తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున వర్షపు నీరు వచ్చి చేరడంతో రోడ్డంతా గుంతలు ఏర్పడింది. నీళ్లు నిలవడంతో ఎక్కడ గుంత ఉందో.. ఎక్కడ చదునుగా ఉందో తెలియక వాహనదారులు తికమకపడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో వచ్చే వాహనదారులు మరింత ఇబ్బందికి గురవుతున్నారు. సంబంధిత అధికారులు నీళ్లు నిలవకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. సర్పంచుల పాలన ముగియడంతో వాళ్లు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలున్నాయి. ప్రత్యేకాధికారులు చూడడంలేదని కాలనీ వాసులు కోరతున్నారు.



గద్వాల-రాయచూరు మార్గంలోని ధరూరు బైపాస్ రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

వేసవి దుక్కులతో బహుళ ప్రయోజనాలు

తాడూరు: వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. సూక్ష్మజీవులు, వానపాముల సంతతి పెరుగుతుంది. తద్వార భూసార అభివృద్ధికి తోడ్పడుతోంది. కలుపు మొక్కలు, చీడపీడలను నివారించవచ్చు. పంటకాలం ముగిసాక భూములను ఖాళీగా ఉంచడంతో పంటలను ఆశించే చీడపురుగులు తెగుళ్లను కలుగజేసే శిలింద్రాలు భూమి పొరల్లో ఆశ్రయం పొందుతాయి. అవి భూమిలో పోషకాలు స్వీకరించడమే కాకుండ భూమిలోపలి పొరల నుంచి నీటిని లాగుతాయి. దీంతో భూమిలోని సారం దెబ్బతిని వానాకాలం పంటల సాగుపై ప్రభావం పడుతుంది. ప్రమాదాన్ని నివారించడానికి రైతులు యాసంగి పంటలు చేతికి అందగానే దుక్కులను దున్ని భూములను ఆరబెట్టాలని వ్యవసాయ అధికారులు సూచనలు, సలహాలు చేస్తున్నారు. రైతులు ఈ పద్ధతి పాటించి వానాకాలంలో మంచి ఫలితాలు సాధించాలని కోరుతున్నారు.

లాభాలు ఎన్నో..

వేసవి కాలంలో రైతులు పంట కోత అనంతరం పొలాన్ని కాలిగా వదిలేస్తుంటారు. దీంతో తొలకరి వానలు పడగానే నీరు భూమిలోకి ఇంకిపోకుండా బయటకు వెళ్తోంది. వర్షాలకు ముందు భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకి భూమి కోతకు గురికాకుండ ఉంటుంది. లోతు దుక్కులతో భూమి పైపొరలు కిందకు కింద పొరలు పైకి తిరగబడి నేల సారవంతంగా మారుతుంది. భూమిలో తేమశాతం పెరిగి భూసారం అభివృద్ధి, పురుగులు, తెగుళ్ల యాజమాన్యం, కలుపుమొక్కల నివారణ వంటి ప్రయోజనాలు సమకూరుతాయి. వేసవి దుక్కులు దున్నేముందు పశువులు పెంటపోగు కంపోస్టు, ఎరువు మట్టిని వెదజల్లడం ద్వార సారవంతమైన పంట దిగుబడితో పాటు తేమశాతం మరింత పెరుగుతుంది. లోతుగా దుక్కి దున్ని తొలకరి వర్షాలకు గొర్రు తిప్పి గుంటకలతో సేద్యం చేస్తే వేర్లు బాగా విస్తరిస్తాయి.

భక్తిశ్రద్ధలతో దీపారాధన



ఆలయంలో దీపారాధన చేస్తున్న పూజారి

తాడూరు: మండల కేంద్రంలోని కొమ్ముగుట్ట ధర్మశాస్త్ర అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలో నిర్వహించే పడిపూజా కార్యక్రమాలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ధర్మకర్త అనుపటి శ్రీనివాసులు, పూజారి పుచ్చ అనురూప్‌శర్మలు తెలిపారు. మంగళవారం ఆలయ ఆవరణాన్ని శుభ్రం చేసి దీపారధన చేశారు. బుధవారం ఆలయ రెండో వార్షికోత్సవ మహాపడిపూజా బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని కోరారు. అన్నదానం చేస్తునట్లు పేర్కొన్నారు.

అడ్డందిడ్డంగా పార్కింగ్



వనపర్తి వైపు వెళ్తున్న గడ్డి ట్రాక్టర్, లారీ

కొత్తకోట రూరల్: పట్టణంలో వాహనాల పార్కింగ్ విచ్చలవిడిగా మారింది. రోడ్డుపై ద్విచక్ర వాహనాలు, తుఫాన్ వాహనాలు, ఆటోలు ఎక్కడపడితే అక్కడ అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో రోడ్డు వెంట వెళ్లే వాహనదారులకు తీవ్ర అంతరాయం ఏర్పడుతుంది. అక్రమ పార్కింగ్ నిరోధించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించాల్సిన పోలీసులు తమకేమీ పట్టనట్టుగా మిన్నకుండిపోతున్నారు. దీంతో పట్టణంలో ఉన్న నాలుగు రోడ్లు పూర్తిగా ట్రాఫిక్ జామ్ ఏర్పడుతుంది. అంతే కాకుండా ప్రధాన రోడ్లకు వైన్ షాపులను ఏర్పాటు చేయడంతో మందు బాబులు తమ బైక్‌లను రోడ్డుకు పక్కనే నిలిపి వైన్ షాపుల్లోకి వెళ్లడంతో అటుగా వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పాలకులు మదనాపురం రోడ్డు విస్తరణ చేపట్టకపోవడంతో ఆత్మకూర్ వైపు వెళ్లే వాహనదారుల ఇబ్బందులు వర్ణణాతీతం. రోడ్డు పక్కన వాహనాలు నిలపొద్దని గతంలో పోలీసులు అక్కడక్కడ బోర్డులు పెట్టినా అవి కనిపించకుండా పోయాయి. గతంలో పోలీసులు అప్పుడప్పుడు ట్రాఫిక్ నియంత్రించడానికి వాహనదారులకు హెచ్చరికలు జారీచేసి చర్యలు తీసుకునేవారు. ప్రస్తుతం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో పట్టణవాసులు పోలీసుల పనితీరుపై విమర్శలు గుప్పిస్తున్నారు.

చెరువులు వెలవెల



నీరు లేక నెర్రలు బారిన గట్టు పెద్ద చెరువు

- చెరువుల్లో చుక్క నీరు కరువు
- దాహం తీర్చుకునేందుకు మూగజీవాల పాట్లు
- కలగానే మిగిలిన గట్టు ఎత్తిపోతల నీరు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు

గట్టు: మండలంలో ప్రధాన నోటిఫైడ్ చెరువుల్లో చుక్క నీరు లేక వెలవెల బోతున్నాయి. మండుటెండలకు చెరువుల్లో గుక్కెడు నీరు లేక పోవడంతో దాహం తీర్చుకునేందుకు మూగజీవాలు తల్లడిల్లే పరిస్థితులు నెలకొన్నాయి. గట్టు చెరువు పద కొండేళ్ల తర్వాత (2009 తర్వాత 2021లో) నిండింది. ఆ తర్వాత 2022లో చెరువులోకి సగం నీరు మాత్రమే వచ్చి చేరింది. 2023 వానకాలంలో ఆశించిన స్థాయిలో వర్షాలు కురువక పోవడంతో చెరువులోకి నీరు చేరలేదు. చెరువుల్లో పుష్కలంగా నీరు ఉంటే చెరువుల చుట్టు పక్కల ప్రాంతాల్లో భూగర్భ జలాలకు ఇబ్బంది ఉండదు. అయితే గతేడాది (2023) రబీలో బోరు నీటి ఆధారంగా పంటలను రైతులు సాగు చేసుకున్న భూగర్భ జలాల తగ్గుదల వల్ల చాలా మంది రైతులు పంటలు ఎండిపోయాయి. ప్రస్తుతం సల్కాపురం, గట్టు, మాచర్ల చెరువుల్లో చుక్క నీరు లేక చెరువులు వెల వెల బోతున్నాయి. సల్కాపురం చెరువు కింద 150 ఎకరాలు, గట్టు చెరువు కింద 300 ఎకరాలు, మాచర్ల చెరువు కింది 300 ఎకరాల ఆయకట్టు సాగవుతుంది. ఈ చెరువులు సక్రమంగా నిండక పోవడంతో ఆయకట్టు మొత్తం బీడుగానే మిగిలిపోతున్నట్లు రైతులు వాపోతున్నారు.



మాచర్ల చెరువు

ఊరిస్తున్న గట్టు ఎత్తిపోతల..

కొన్ని సంవత్సరాలుగా గట్టు ఎత్తిపోతల పథకం గట్టు రైతులను ఊరిస్తూనే ఉంది. నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా ర్యాలంపాడు రిజర్వాయర్ ద్వారా గట్టు మండలంలోని కొన్ని ప్రాంతాలకు మాత్రమే కాల్వ ద్వారా సాగునీరు అందుతోంది. మిగతా సగభాగం ఇప్పటి బోరు నీటితో పాటుగా వర్షాధారంగా పంటలను సాగు చేసుకుంటున్నారు. గట్టు ఎత్తిపోతల పథకాన్ని మల్లాపురం తండా, కేటీదొడ్డి గ్రామాల మధ్య గుట్టల మధ్యన 1.5 టీఎంసీల సామర్థ్యంతో గతేడాది నుంచి పనులను ప్రారంభించి కొనసాగిస్తున్నారు. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తయి ఉపయోగంలోకి వస్తే, ఈ ప్రాంత రైతుల కష్టాలు శాశ్వతంగా దూరం కానున్నాయి.

చెరువులకు మహర్దశ..

మండలంలోని ప్రధాన చెరువులు నీరు లేక వెల వెల బోతున్నాయి. చెరువుల కింది ఆయకట్టు మొత్తం బీడుగా మారి ముండ్ల కంపలతో నిండిపోయింది. గట్టు ఎత్తిపోతల పథకం సాకారం అయితే గట్టు, సల్కాపురం, మాచర్ల, కుచినేర్ల గ్రామాల్లోని నోటిఫైడ్ చెరువులకు మహర్దశ పట్టనుంది. గట్టు పెద్ద చెరువు వర్షాధారంగానే నిండుతుంది. చెరువు నిండక పోవడంతో ఆయకట్టు బీడుగా మారింది. ఈ చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు సాగవుతోంది. సల్కాపురం, మాచర్ల చెన్న కేశస్వామి చెరువు, కుచినేర్ల కొత్త చెరువు, పాత చెరువుల పరిస్థితి అంతే. ఈ చెరువులు వర్షాలకు నిండాల్సిందే. గట్టు ఎత్తిపోతల పథకం పూర్తయితే ఈ చెరువులకు మహర్దశ పట్టనుంది. వాటితో పాటుగా చిన్న చిన్న కుంటలను కూడా నీటిని వదలడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి, సాగు కష్టాలు తీరనున్నాయి. కరువు గట్టు కాస్త మరో కోనసీమను తలపించడం ఖాయం.

చెరువులు నింపాలి



చెరువులు నిండక చాలా కాలమైంది. ఆయకట్టు మొత్తం బీడుగా మిగిలింది. వానలు బాగా పడితేనే చెరువులు నిండుతాయి. గట్టు ఎత్తిపోతల పథకాన్ని త్వరగా చేపట్టి, చెరువులకు నీటిని విడుదల చేయాలి. వర్షాలు పడక బోర్లు ఎండిపోయి, వ్యవసాయం భారంగా మారింది. కరువు నుంచి బయట పడాలంటే గట్టు ఎత్తిపోతల పథకం ఒక్కటే మార్గం.

– లబ్బన్న, రైతు, గట్టు

గట్టు లిఫ్టును త్వరగా పూర్తి చేయాలి



గట్టు ఎత్తిపోతల పథకాన్ని త్వరగా పూర్తి చేసి, చెరువులకు నీటిని వదలాలి. సల్కాపురం, గట్టు, మాచర్ల చెరువులు ఇప్పటికి వర్షాలపైనే ఆధార పద్దాయి. వర్షాలు సంమృద్ధిగా కురిస్తేనే ఈ చెరువులు నిండుతాయి. ఒక ఏడాది చెరువు నిండితే మళ్లీ రెండు, మూడేళ్ల వరకు చెరువులు నిండవు. వర్షాలు సక్రమంగా కురువక పోవడంతో చెరువులు నిండడం లేదు. దీంతో భూగర్భ జలాలు తగ్గుతున్నాయి. చెరువులకు కాల్వ నీటిని వదిలి, చెరువుల్లో ఎప్పుడూ నీరు ఉండే విధంగా చూడాలి.

– మహాదేవ్, రైతు, గట్టు